క్లుప్తంగా

జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జడ్జి రవి

చెన్నూర్: ఈనెల 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి కోరారు. స్థానిక కోర్టులో పోలీసు అధికారులు, బ్యాంకర్లతో శనివారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, డ్రంకెన్ డ్రైవ్ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలని సూచించారు. చెన్నూర్ సీఐ రవీందర్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు మల్లేశం, జూనియర్ న్యాయవాది నాగులు, చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ ఎస్సైలు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లి యువతికి పీహెచ్‌డీ పట్టా



శంకర జ్యోతి

బెల్లంపల్లి: కార్మికక్షేత్రం బెల్లంపల్లి కన్నాలబస్తీకి చెందిన శంకరజ్యోతికి పీహెచ్‌డీ పట్టా వరించింది. జి.పద్మావతి, సోమిరెడ్డి దంపతుల కూతురైన శంకర జ్యోతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి శనివారం పట్టా అందుకున్నారు. 'ఏ స్టడీ ఆన్ రెగ్యులర్ డామినేషన్ ఇన్ లిటాక్ట్ గ్రాఫ్స్'అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను పీహెచ్‌డీ పట్టా దక్కింది. ప్రస్తుతం ఆమె ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల డి గ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నా రు. మంచిర్యాలలో డిగ్రీ పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లి పోస్టు గ్రాడ్యుయేషన్ చదివారు. గణితంలో ఇబ్బంది పడకుండా సులభంగా అర్థమయ్యేలా ఉండాలని లక్ష్యం పెట్టుకుని పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపారు. తనను ఉన్నతంగా చదివించిన తల్లిదండ్రుల కు, వెన్నంటి ఉండి తోడ్పాటు అందించిన భర్త అనిల్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

యువతి పెళ్లికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న సదానందం దంపతులు

మందమర్రిరూరల్: కోటపల్లి మండలం జనగామ గ్రామానికి చెందిన కూకట్ల పోశం–మల్లేశ్వరి దంపతుల కుమార్తె అంజలి వివాహం ఈనెల 9న జరగనుంది. వారి ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ ఊరు మందమర్రి రోడ్డులోని తన నివాసంలో శనివారం అంజలి పెళ్లిఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదుతోపాటు చీర సారె అందించారు. ఈ సందర్భంగా సదానందంను కుల సంఘం నాయకులు, పలువురు స్థానికులు అభినందించారు.

ఎస్సై, కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి



కరీంనగర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్

మంచిర్యాలటౌన్: ఈ నెల 27న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నస్పూర్ పోలింగ్ కేంద్రం వద్ద ఎస్సై సుగుణాకర్, కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఎస్సై సుగుణాకర్ బీజేపీ నాయకుడు కమలాకర్‌పై చేయి చేసుకున్నారని, కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యకర్తలపై రాళ్లదాడి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, బత్తుల సమ్మయ్య పాల్గొన్నారు.

నంబాలలో వైద్యశిబిరం

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామంలో గతకొన్ని రోజులుగా పలువురు ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాద్, పీహెచ్‌సీ డాక్టర్ సతీశ్, వైద్యసిబ్బంది జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లారు. జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఇళ్ల చుట్టూ దోమల నివారణ మందులు పిచికారి చేయించారు. జ్వరపీడితులకు వైద్యపరీక్షలు చేయించి మందులు అందించారు. మంచిర్యాల సబ్ యూనిట్ ఆఫీసర్ నాందేవ్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ సంతోష్, సబ్‌సెంటర్ వైద్యుడు మారుతి, హెల్త్ సూపర్‌వైజర్లు రమణ, కృష్ణవేణి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కానరాని పచ్చదనం



బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్‌ఏరియా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఆహ్లాదం కలిగించడానికి పూల మొక్కలు, గడ్డిని పెంచారు. వీటికి నీటితడులు అందించడానికి ప్రత్యేకంగా పైపులైన్ ఏర్పాటు చేశారు. రోజువారీగా సిబ్బంది వాటికి నీళ్లు పట్టించారు. ఏడాదికిపైగా పట్టించుకోకపోవడంతో పూల మొక్కలు, గడ్డి ఎండిపోయింది. పచ్చదనం ఆనవాళ్లు కానరాకుండా ఉన్నాయి. మున్సిపల్ అధికారులు శ్రద్ధ వహించి సంరక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అందని కంప్యూటర్ విద్య

భీమారం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ విద్య అందడం లేదు. 15 ఏళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసిన 10 కంప్యూటర్లను పూర్తిస్థాయిలో వినియోగించకుండానే మూలనపడ్డాయి. పాఠశాలలో కంప్యూటర్ విద్య అందించేందుకు ప్రత్యేక టీచర్ లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. వాటిని ఇటీవల డీఈవో కార్యాలయానికి తరలించారు.



సంత..చింత



భీమిని: మండల కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే సంత ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై కొనసాగుతోంది. దీంతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. సంతలో నిత్యావసర సరుకులు, తదితర వాటికి కొనుగోలు కోసం గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. దీంతో పెద్ద వాహనాలు వచ్చినపుడు ట్రాఫిక్ ఏర్పడడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో సంత ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నీల్వాయికి తొలగిన అడ్డంకి



ఒడ్డుగూడం వద్ద అటవీ భూమిలో తవ్వకాలు చేపడుతున్న జేసీబీలు

- ఎడమ కాలువ నిర్మాణానికి అటవీశాఖ క్లియరెన్స్
- జూన్‌లోపు పనులు పూర్తిచేయాలి

వేమనపల్లి: ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెరపడింది. నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకి తొలగింది. దీంతో నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 2005లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పథకం కింద నిర్మాణానికి రూ.96 కోట్లు నిధులు కేటాయించారు. ఎం.వీ.ఆర్.సోహెన్ జాయింట్ వెంచర్ కంపెనీ పనులు చేపట్టి పూర్తి చేయకుండానే మధ్యలో తప్పుకుంది. 2011 తర్వాత ఆర్.కె.రత్న కంపెనీ టెండర్‌లో పనులు చేజిక్కించుకుంది. ప్రతీ బడ్జెట్‌తో ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ రూ.216.47 కోట్ల వరకు ఎడమ కాలువ నిర్మాణానికి అటవీ శాఖ అడ్డంకి గుదిబండగా మారింది. ప్రాజెక్టు ఆయకట్టు 13 వేల ఎకరాలు ఉండగా సగానికి సైతం నీళ్లు అందలేని పరిస్థితి. కేవలం కుడి కాలువ మాత్రమే గతంలోనే పూర్తయింది. ఎడమ కాలువ ప్యాచ్‌ఫోర్ మంగెనపల్లి వద్ద 4.7 కి.మీ నుంచి 5.5 కి.మీ వరకు, ప్యాచ్–3 ఒడ్డుగూడం వద్ద 8–ఆర్ డిస్ట్రిబ్యూటర్ కాలువతోపాటు ప్యాచ్–2 కింద 8.5 నుంచి 11 కి.మీ వరకు, ప్యాచ్ –1 కింద 11.01 నుంచి 12.2 కి.మీ వరకు అటవీ శాఖ తమ భూమిగా పేర్కొంటూ 2017 నుంచి పనులను అడ్డుకుంటూనే ఉంది. పలు దఫాలుగా ఇరిగేషన్, అటవీ శాఖ సర్వేలు చేసింది. అటవీ శాఖ క్లియరెన్స్ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిన చిక్కుముడి వీడలేదు.



ట్రఫ్‌వాల్ సిస్టమ్‌లో కాలువ నిర్మిస్తున్న దృశ్యం

రూ.4.5 కోట్ల పరిహారం చెల్లింపు

ఎడమ కాలువలో ముంపునకు గురవుతున్న భూమికి రెండు దఫాలుగా మొత్తం రూ.4.5 కోట్ల పరిహారం ప్రభుత్వం అటవీ శాఖకు చెల్లించింది. అటవీ భూమికి బదులు 46 ఎకరాల భూమిని పెంచికలపేట మండలం కమ్మర్‌గాం శివారులో భూమిని ఇచ్చింది. ఇందులో రూ.4 కోట్లను అప్పటి బీఆర్ఎస్ హయాంలో చెల్లించగా వైల్డ్‌లైఫ్ కన్జర్వేటర్ కింద రూ.50 లక్షలు చెల్లించాలని అటవీశాఖ మళ్లీ ఆంక్షలు విధించింది. రూ.50 లక్షలు చెల్లించేందుకు గత ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో పనుల్లో పురోగతి లేక పెండింగ్‌లోనే ఉండిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 8 ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎడమ కాలువ పెండింగ్ పనులు ఆయకట్టుకు నీరందలేని పరిస్థితి ఉందని స్థానిక మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్ కుమార్, ఎమ్మెల్యే వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నీల్వాయి ప్రాజెక్టుకు పెండింగ్ పనుల నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న రూ.50 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించడంతో తాజాగా వైల్డ్‌లైఫ్ చిక్కుముడి వీడింది. గత నెల రోజులుగా ఆర్.కె.రత్న జాయింట్ వెంచర్ కంపెనీతో ఇరిగేషన్ శాఖ పెండింగ్ పనులు చేపడుతోంది. ఇప్పటికే ఒడ్డుగూడం వద్ద ఉన్న అటవీ భూమిలో కాలువ నిర్మాణం కోసం తవ్వకాలు పూర్తయింది. ట్రఫ్ వాల్‌సిస్టమ్‌లో పనులు చేపడుతున్నారు. మంగెనపల్లి వద్ద అటవీ భూమిలో కాలువ నిర్మాణం కోసం జేసీబీలతో తవ్వకాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే సుమారు 8 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందనున్నాయని ఇరిగేషన్ శాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. మండలంతోపాటు కోటపల్లి మండలంలోని పలు గ్రామాలకు సాగునీటి కష్టాలు కొంత మేరకు తగ్గనున్నాయి. భూగర్భజల నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది.

జూన్‌లోపు పూర్తి చేస్తాం

నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ పనులకు అటవీ శాఖ అనుమతి లభించింది. జూన్ లోపు 5–ఆర్, ఇతర మైనర్ కాలువలు పూర్తి చేస్తాం. మంగెనపల్లి, ఒడ్డుగూడం, సుంపుటం వద్ద పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తవడంతో మండలంలో పెద్ద మొత్తంలో ఆయకట్టుకు నీళ్లు అందిస్తాం.

– వెంకటస్వామి, డీఈ

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్: సింగరేణిలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నేతలు కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ ఎన్. బలరాంనాయక్‌ను రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ బి.జనక్‌ప్రసాద్‌లు కలిశారు. కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. సొంతింటికల నెరవేర్చడంతోపాటు 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి రూ.30 లక్షలు వడ్డీలేని రుణం ఇవ్వాలన్నారు. కోలిండియాలో మాదిరిగా సింగరేణిలో కార్మికులకు అలవెన్సులపై ఆదాయపన్ను చెల్లించాలన్నారు. నాగాల పేరుతో డిస్మిస్ అయిన కార్మికులకు ఒకసారి అవకాశంగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు.



సీఎండీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అలాగే సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్.బలరాం నాయక్‌ను ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ శనివారం కలిసి వినతిపత్రం అందించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు అక్బర్‌అలీ, తిరుపతి, సహాయ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏజీఎంకు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఫైనాన్స్ ఏజీఎంగా పనిచేసి ఎస్టీపీపీకి బదిలీపై వెళ్తున్న ఏజీఎం మురళీధర్‌ను ఏరియా అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం ఎం.శ్రీనివాస్ ఆయన్ను శాలువతో సత్కరించారు. ఆయన ఏరియాలో చేసిన సేవలను కొనియాడారు. ఎస్ఓటుజీఎం ఎన్.సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్‌కుమార్, ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, పర్చేస్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మురళీధర్‌ను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్

మందమర్రి జీఎంపై ఫిర్యాదు

బెల్లంపల్లి/మందమర్రిరూరల్:మందమర్రి ఏరియా జీఎం దేవేందర్‌పై దళిత సంఘాల నాయకులు శనివారం బెల్లంపల్లి ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఓ కార్మికుడి సమస్యపై మాట్లాడటానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ మందమర్రి జీఎం కార్యాలయానికి వెళ్లాడు. మల్లేశ్‌ను ఉద్దేశించి జీఎం దేవేందర్ ఒక్కసారిగా కోపోద్రిక్తుడై దురుసుగా ప్రవర్తించి అవమానించాడు. దళితుడైన మల్లేశ్‌ను అవమానించి అసభ్యకరంగా మాట్లాడినట్లు ఏసీపీకి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జీ ఎంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కో రుతూ దళిత సంఘాల నాయకులు ఏసీపీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు దాగం మల్లేశ్‌తోపాటు దళిత, నేతకాని సంఘం నాయకులు దుర్గం గోపాల్, గోమాస రాజం, కల్వల శరత్‌కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా మందమర్రి ఎస్సై రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై జీఎం దేవేందర్‌ను వివరణ కోరగా కార్మికుడి బదిలీ తర్వాత చూద్దామని చెప్పాను తప్ప నేనేమి అనలేదన్నారు.

కోలిండియా క్రీడాకారులకు సన్మానం

శ్రీరాంపూర్: ఇటీవల జరిగిన కోలిండియా క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన శ్రీరాంపూర్ క్రీడాకారులను ఐఎన్టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. హాకీ, ఫుట్‌బాల్ క్యారమ్స్‌లో బంగారు పతకాలు సాధించిన బెల్లం తిరుపతి, ఎస్కే తాజుద్దీన్‌లను శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు ఆధ్వర్యంలో సత్కరించారు. ముమ్ముందు మరిన్ని పతకాలు సాధించి ఏరియాకు, కంపెనీకి పేరు తేవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, బ్రాంచి నాయకులు జీవన్ జోయల్, శీలం చిన్నయ్య, ఓరం జగన్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి



మందమర్రిలో నివాళులర్పిస్తున్న నాయకులు



జన్నారంలో నివాళులర్పిస్తున్న నాయకులు

దండేపల్లి: ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానంలో ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు దండేపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు మంతెన నవీన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వినయ్, నాయకులు నరేశ్, సత్తయ్య, శంకర్, మల్లేశ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమయ్య శనివారం అమరవీరులకు నివాళులర్పించారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. ఈనెల 6న మంచిర్యాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఉంటుందని వ్యవస్థాపకుడు మందకృష్ణ హాజరవుతారన్నారు. మండల ఇన్‌చార్జి జీడి సారంగం, పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వీహెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షుడు రాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమారం: మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండల కన్వీనర్ సత్యనారాయణ, నాయకులు మొండయ్య, సురేశ్, నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు రాజన్న, రెడ్డి జాగృతి నాయకులు సత్తిరెడ్డి, యాదవసంఘం నాయకులు విజయ్‌రాజ్, కొమురయ్య, శ్రీనివాస్, రజకసంఘం నాయకులు కేదారి, శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో అమరులకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్ నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి జంగం రవి, నాయకులు ఇందయ్య, రమేశ్, రాజేశ్, ప్రశాంత్, ప్రవీణ్, రాజేందర్, గంగన్న పాల్గొన్నారు.

చెన్నూర్: స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లేశ్ శనివారం మాదిగ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 11శాతం న్యాయమైన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, నారాయణ, నాగరాజు, నవీన్, కృష్ణ, భాస్కర్, రాజన్న పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ అలవర్చుకోవాలి

బెల్లంపల్లి: ప్రతీ విద్యార్థి క్రమశిక్షణను అలవర్చుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాల ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ అన్నారు. శనివారం పదోతరగతి, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతిప్రజ్వలన చేయగా అనంతర విద్యార్థుల నృత్యాలను అలరించాయి. వైస్ ప్రిన్సిపాల్ విజయప్రసాద్ పాల్గొన్నారు.

దండేపల్లి: లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఆడిపాడారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్

చెన్నూర్: చెన్నూర్ కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుమలత ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తులు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు జిల్లా అల్పసంఖ్యాయక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికిగాను జిల్లాలోని ఉపాధ్యాయులు ఈనెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు కలెక్టరేట్ భవనంలోని మొదటి అంతస్తు ఎఫ్5లో గల మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు ఫారం పొందవచ్చని తెలిపారు. వివరాలకు సెల్ 8555 841417 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న సైన్స్ కార్నివాల్

చెన్నూర్: సైన్స్ కార్నివల్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని ఎంఈవో రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక అభ్యాస్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ కార్నివాల్స్‌లో విద్యార్థులు 30 ప్రాజెక్టులను తయారు చేశారు. వారి ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకున్నాయి. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేశ్, రిటైర్డ్ పీఈటీ రామయ్య పాల్గొన్నారు.

బీసీలు అన్నిరంగాల్లో రాణించాలి

పాతమంచిర్యాల: బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మనోహర్, సదానందం, గణేశ్, లతీఫ్, నటేశ్వర్ అలేఖ్య, శ్యామల, సత్యవతి, పద్మ మంగ, స్వప్న ఉన్నారు.

నేడు మహిళా దినోత్సవం

మంచిర్యాలటౌన్: రెడ్డి మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సొసైటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డు ఏకలవ్య ఆశ్రమం వద్ద గల హరినిలయ కన్వెన్షన్ సెంటర్‌లో మహిళలకు ఆటల పోటీలు ఉంటాయన్నారు. ఇందులో పాల్గొనేవారు సమయానికి హాజరుకావాలని సూచించారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని అందుగులపేట వద్ద జాతీయరహదారి సమీపంలో 364 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మంచిర్యాలలోని కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ మోతీలాల్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

వసతిగృహంలో అడిషనల్ కలెక్టర్ నిద్ర



విద్యార్థులతో కలిసి నిద్రపోతున్న మోతీలాల్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ శనివారం రాత్రి నిద్రించారు. ముందుగా వసతి గృహ పరిసరాలు, వంటగది రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, డీబీసీడీవో పురుషోత్తం, డీఆర్పీ జనార్దన్, వార్డెన్ శ్రీనివాస్ ఉన్నారు.

బైక్ చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన సాయినాథ్ బైక్ చోరీకి గురైంది. వారం క్రితం తన ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగలు చోరీ చేశారని బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

పద్మశాలి మహాసభలు విజయవంతం చేయండి

జైపూర్: 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి సదానందం కోరారు. మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు వేముల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి భూమన్న, మాజీ సర్పంచ్ గణేశ్‌తో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో నాంపెల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 9న నిర్వహించే మహాసభలకు పద్మశాలి సోదరులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు శంకర్, భూమయ్య, రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి అక్షింతలు తయారు

జన్నారం: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమికి నిర్వహించే సీతారాముల కల్యాణానికి అక్షింతలు తయారు చేస్తున్నారు. శనివారం గోటితో అక్షింతలను తీసే కార్యక్రమం ప్రారంభించారు. భద్రాచలం నుంచి వచ్చిన ఈ అక్షింతలను మండల కేంద్రానికి చెందిన కొత్త నిర్మల ఆధ్వర్యంలో పలువురు మహిళలు గోటితో ఒలుస్తున్నారు.

కంటిశిబిరం

కోటపల్లి: శంకరాపూర్, శెట్‌పల్లి, బామన్‌పల్లి, పంగిడిసోమారం గ్రామాల్లో మంచిర్యాలకు చెందిన పవన్ ఆప్టికల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటిపరీక్ష శిబిరాన్ని ఎస్సై రాజేందర్ శనివారం ప్రారంభించారు. 43 మందిని గుర్తించి శస్త్రచికిత్స చేయాలని వైద్యసిబ్బంది సూచించారు.